# భారతదేశ ఆర్థిక విధానం... పంచవర్ష ప్రణాళికలు!!

**ఏ ఆశయాన్నైనా సాధించటానికి ప్రణాళికా బద్ధ మైన కృషి అత్యవసరం. భారతదేశం తన ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసుకోవటానికి ప్రణాళికాబద్ధమైన కృషి అత్యవసరమని స్వాతంత్ర్యానికి పూర్వమే గ్రహించింది. అప్పటి సోవియట్ యూనియన్ 7 సంవత్సరాల ప్రణాళిక కృషి వల్ల సాధించిన ప్రగతితో ముగ్ధుడైన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ... భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రణాళికల ఆవశ్యకతను నొక్కిచెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ చరిత్రలో... 1930లలోనే ప్రారంభమైన ప్రణాళికా విధానం.. బ్రిటిష్ ప్రభుత్వం 1944లో ప్రణాళికా బోర్డును ఏర్పాటు చేయడంతో వ్యవస్థీకృతమైంది. ప్రైవేటు పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నిపుణులు రూపొందించిన 3 ప్రణాళికలు 1944 నుంచి 1946 వరకు అమలయ్యాయి. ఆ విధంగా దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధికి బీజం పడింది...**

స్వాతంత్ర్యానంతరం... సోషలిస్టు భావాలున్న ప్రథమ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ.. మార్చి 15, 1950లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. ప్రణాళికా సంఘం రోజూవారీ కార్యనిర్వహణ కోసం కేబినెట్ మంత్రి హోదాతో ఉపాధ్యక్షుడ్ని కూడా నియమించారు. ఆర్థిక, పారి శ్రామిక, పరిపాలన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిపుణులైన వారిని పూర్తిస్థాయి సభ్యులుగా... ముఖ్యమైనశాఖల కాబినేట్ మంత్రులను ఆయా విషయాలపై చర్చించేటప్పుడు పాక్షిక సభ్యులుగానూ నియమించటం జరుగుతుంది. జాతీయ వనరులను లెక్కించటం.. ఆ వనరుల సక్రమ సదుపయోగానికి పంచవర్ష ప్రణాళికను రూపొందించటం.. వనరుల వినియోగంలో ప్రాముఖ్యతలను నిర్ధారించటం.. ప్రాముఖ్యతా క్రమంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా వనరుల సద్వినియోగానికి అమలుచేసే వ్యవస్థను తయారుచేయటం..ప్రణాళిక విజయవంతంగా అమలౌతుందీ, లేనిదీ సమయబద్ధంగా సమీక్షించటం... ప్రణాళికా సంఘం ముఖ్యపనులు. ప్రణాళికా సంఘం జాతీయ అవసరాల ఆధారంగా పంచవర్ష ప్రణాళిక ముసాయిదాను తయారు చేసి, వివిధ రాష్ట్రాలకు వాటివాటి అభిప్రాయాల కోసం పంపుతుంది. రాష్ట్రాలు ఏమైనా మార్పులను ప్రతిపాదించవచ్చు. ఈ ప్రతిపాదనలన్నీ చర్చించి, సంబంధిత రాష్ట్రాల అవసరాలు, జాతీయ అవసరాలు సమ్మిళితమయ్యే విధంగా.. ప్రధానమంత్రి నేతృత్వంలో జాతీయ అభివృద్ధి మండలి (National Development Council), ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రణాళికా సంఘ సభ్యులు, (వీరంతా National Development Council సభ్యులు) చర్చించి... ప్రణాళిక అంతిమ Draftను తయారుచేస్తారు. జాతీయ సలహామండలి ఆమోదం పొందిన ఈ అంతిమ Draft... పార్లమెంటు, కేబినెట్ ఆమోదం కూడా పొంది, రానున్న ఐదేళ్లకు దేశ ఆర్థిక ప్రణాళికగా పరిగణనలోకి వస్తుంది. ఇప్పటి వరకు భారత దేశంలో 10 పంచవర్ష ప్రణాళికలు అమలయ్యాయి. ప్రస్తుతం 11వ పంచవర్ష ప్రణాళిక 2007-2012 అమల్లో ఉంది.

## పది ప్రణాళికల్లో ఏమి సాధించాం?

మొదటి పంచవర్ష ప్రణాళిక(1951-1956) 1951లో ప్రారంభమైంది. నీటిపారుదల, వ్యవసాయం, రవాణా రంగాలకు ప్రాధాన్యాన్నిచ్చిన ఈ ప్రణాళికలో ... అనుకున్న లక్ష్యం కంటే ఎక్కువగా స్థూల జాతీయ ఉత్పత్తిలో 3.6 శాతం వృద్ధి సాధించటం జరిగింది. రుతుపవనాలు అనుకూలించటం, నీటిపారుదల రంగంలో భాక్రా నంగల్, హీరాకుడ్, మెట్టూర్ డామ్‌ల నిర్మాణం ప్రారంభంతో వ్యవసాయంలో దిగుబడులు పెరిగాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహాయంతో మహిళా శిశుసంక్షేమంపై శ్రద్ధ చూపటంతో శిశు మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టి.. జనసంఖ్య పెరగటం మొదలైంది. ఈ విధంగా వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిన మొదటి పంచవర్ష ప్రణాళికతో ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధికి అంకురార్పణ జరిగింది. ఆశించిన లక్ష్యాల సాధనలో కూడా ఈ ప్రణాళిక స్థూలంగా విజయం సాధించిందనే చెప్పాలి.

## పారిశ్రామికీకరణకు పెద్దపీట:

రెండో పంచవర్ష ప్రణాళిక (1956-1961) పారిశ్రామికీకరణకు పెద్దపీట వేసింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యమిచ్చారు. ఇనుము, ఉక్కు, బొగ్గు, జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులపై ఈ ప్రణాళిక విశేష దృష్టి సారించింది. రెండో పంచవర్ష ప్రణాళిక.. ఆర్థిక నిపుణుడైన ప్రసన్న చంద్ర మహలానోబిస్ 1953లో ప్రతిపాదించిన మహలానోబిస్ సిద్ధాంతం ఆధారంగా తన ప్రాధాన్యతలను తయారుచేసుకుంది. ఆర్థిక వ్యవస్థను Closed economyగా భావించే ఈ సిద్ధాంతం...వనరుల కేటాయింపు విషయంలో వినియోగదారుల వస్తువులు (Consumer Goods), capital వస్తువుల లాభనష్టాలను భేరీజు వేసి.. Capital వస్తువుల (ఆస్తుల సృష్టికి దారితీసేవి)పై దృష్టి పెట్టాలనీ, తద్వారానే దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి సాధ్యమని... ఆర్థికాభివృద్ధిని గరిష్ట స్థాయికి తీసుకెళ్లటానికి ఉత్పాదిక రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరముందని ప్రతిపాదించింది. ఈ ప్రణాళికా కాలంలో బిలాయ్, దుర్గాపూర్, జెంషడ్‌పూర్‌లలో ఇనుము ఉక్కు కర్మాగారాలు; జలవిద్యుత్ ప్రాజెక్టులు, కొత్త రైల్వే లైన్లు, బొగ్గు కర్మాగారాలు ప్రారంభించారు. 1957లో హోమీబాబా అధ్యక్షుడిగా అణుశక్తి సంస్థ (Atomic Energy Commission) ఏర్పాటైంది. ఈ రకంగా పారిశ్రామిక రంగంలో పటిష్టమైన పునాదిని వేయటంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులైన గ్రామాల్లో జమీం దారీ వ్యవస్థను రద్దుచేయటం ద్వారా...గ్రామస్థాయిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావటానికి 2వ పంచవర్ష ప్రణాళిక మంచి ఆరంభాన్నిచ్చింది. రెండు పంచవర్ష ప్రణాళికల విజయోత్సాహంతో...మూడో పంచవర్ష ప్రణాళిక (1961-66)లో వ్యవసాయ రంగం, రక్షణరంగం, ధరల స్థిరీకరణ, సిమెంటు ఎరువుల కర్మాగారాల స్థాపన వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించటం జరిగింది. వ్యవసాయ రంగంలో ధాన్యం ఉత్పాదకతను పెంచటానికి విశేష ప్రాధాన్యతను ఇచ్చిన తరుణంలో 1962లో భారత్‌పై చైనా దాడి చేసింది. దాంతో ప్రాధాన్యత వ్యవసాయరంగం నుంచి రక్షణ రంగానికి మరలింది.

## వ్యవసాయంపై దృష్టి:

యుద్ధంలో భారత్ ఘోరంగా దెబ్బతినటంతో.. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ప్రభుత్వ ప్రణాళికా ప్రాధాన్యత ధరల స్థిరీకరణ వైపు మళ్లింది. 1965లో హరితవిప్లవం (మేలుజాతి వంగడాలు, రసాయనిక ఎరువులు, నీటిపారుదల ద్వారా ఆహార ధాన్యాల ఉత్పాదకతలో వచ్చిన గణనీయమైన వృద్ధి)... ప్రణాళికా దృష్టిని మళ్లీ వ్యవసాయరంగం వైపు మళ్లింపజేసింది. ఆహార భద్రత కోసం ఆహార ధాన్యాల నిల్వలను పెంచుకోవటం.. దిగుమతులను తగ్గించటం ద్వారా స్వావలంభన సాధించటం వంటి విషయాలపై దృష్టి సారించటం జరిగింది. ప్రజాస్వామ్యాన్ని ప్రాథమిక స్థాయికి తీసుకెళ్లటానికి పంచాయితీ ఎన్నికలను నిర్వహించటం...విద్యారంగంలో ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు..రాష్ట్రాలకు అభివృద్ధి రంగంలో మరిన్ని బాధ్యతలు అప్పగించటం వంటివి 3వ ప్రణాళికా కాలంలో పేర్కొనదగ్గ అంశాలు. అయితే, 1962లో చైనాతో, 1965లో పాకిస్థాన్‌తో యుద్ధాల వల్ల మూడో పంచవర్ష ప్రణాళిక ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించ లేకపోయింది.

ఈ నిరుత్సాహంతో 1966-69ల మధ్య 3 వార్షిక ప్రణాళికలను అమలు చేశారు. ఇదే సమయంలో స్వాతంత్ర్యానంతరం 20 ఏళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగినా.. పేదరికం సమస్యగానే ఉంది. భూసంస్కరణలను అన్ని రాష్ట్రాలు సమర్థవంతంగా అమలు చేయకపోవటంతో...గ్రామీణ పేదరికం, ధనిక పేదల అంతరం పెరుగుతూనే వచ్చింది. ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల ద్వారా అభివృద్ధికి కృషి చేస్తే...గాంధీజీ సర్వోదయ సిద్ధాంతం (వనరులన్నింటికీ ప్రజలందరిని యజమానులుగా చేసి పరస్పర లాభం, అభివృద్ధి కోసం... సమాజ శ్రేయస్సు అంతిమ లక్ష్యంగా ప్రజల సమష్టి యాజమాన్య హక్కు ద్వారా సామాజిక అభివృద్ధిని సాధించటం)... సంఘసంస్కర్త వినోబాభావే ప్రారంభించిన భూదాన్ ఉద్యమం (వినోబాభావే గ్రామగ్రామానికీ తిరిగి, ప్రతి గ్రామంలో పెద్ద భూస్వాములతో తనను వారి కొడుకుగా దత్తత చేసుకోమని..వారి ఆస్తిలో కొంత భాగాన్ని తనకు ధనంగా ఇమ్మని..అలా సేకరించిన భూమిని గ్రామాల్లో భూమిలేని నిరుపేదలకు పంచిన కార్యక్రమం) శాంతియుత సామాజిక ప్రేరణ ద్వారా గ్రామీణ ఆర్థిక అసమానతలను తగ్గించటానికి ప్రయత్నించాయి. ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత 4వ పంచవర్ష ప్రణాళిక (1969-74) ప్రారంభమైంది. దేశాన్ని పీడించిన కరవు కాటకాలు, ఆర్థిక మాంద్యం నేపథ్యంలో...4వ పంచవర్ష ప్రణాళిక అప్పటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెంచటం ద్వారా పూర్తిస్థాయి స్వాలంబన సాధించటంపై విశేష కృషి జరిగింది.

ఈ ప్రణాళికా కాలంలోనే..19 బ్యాంకులను కేంద్రంలోని ఇందిరాగాంధీ ప్రభుత్వం జాతీయం చేసింది. అయితే, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సిరావటం, బంగ్లాదేశ్ ఏర్పాటు, తదనంతరం 1974లో అణుపరీక్షలు పాలకుల దృష్టిని మరల్చటంలో సఫలీ కృతమయ్యాయి. ప్రభుత్వ రంగంలో వ్యయాన్ని పెంచినా...ఆశించిన జాతీయ ఆదాయ లక్ష్యాన్ని సాధించలేకపోయింది. హరిత విప్లవం ప్రారంభదశ నుంచి పరిపక్వదశకు వచ్చింది. పారిశ్రామికాభివృద్ధికి కేటాయించిన వనరులు..యుద్ధానికి మళ్లించడంతో

లక్ష్యసాధన ఆశించిన రీతిలో జరగలేదు.

## ఆరో ప్రణాళిక- కీలక మార్పులు:

అంతర్జాతీయ చమురు ధరలు ఆకాశాన్నంటటంతో... ఆదిలోనే లక్ష్యాలను పునఃసమీక్షించవలసి రావటంతో ఐదో పంచవర్ష ప్రణాళిక (1974-79) ఇబ్బందులను ఎదుర్కొంది. పేదరిక నిర్మూలన, ఉద్యోగావకాశాలు, సామాజిక న్యాయం, వ్యవసాయం, రక్షణ రంగాల్లో స్వావలంబన ముఖ్య ప్రాధాన్యతలుగా ఈ ప్రణాళిక ప్రారంభమైంది. హరితవిప్లవ ఫలితంగా ఆహార భద్రత, ఆహార నిల్వల స్థాయి గణనీయంగా పెరిగింది. స్వయం ఉపాధి ద్వారా గ్రామీణ పట్టణ పేదరికాన్ని తగ్గించటం.. ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమలపై దృష్టి సారించటం..1975లో విద్యుత్ సరఫరా రంగాల్లో ప్రవేశించటం... ఈప్రణాళికా కాలంలో ఇతర ముఖ్యాంశాలు. అయితే, 1978లో మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ఎన్నికైన జనతా ప్రభుత్వం...ఈ ప్రణాళికను తిరస్కరించి, రద్దుచేయటంతో ఐదో పంచవర్ష ప్రణాళిక తన లక్ష్యాలను ఆశించిన స్థాయిలో సాధించలేకపోయింది. 1978,79లలో వార్షిక ప్రణాళికలను అమలు చేశారు. 6వ పంచవర్ష ప్రణాళిక (1980-85)లో..నెహ్రూ ఆలోచనా విధానానికి భిన్నంగా విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఉపాధి కల్పన, పారిశ్రామికాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ , పర్యాటక రంగం, ఆర్థిక సంస్కరణలు, కుటుంబ నియంత్రణ మొదలైన అంశాలకు ఈ ప్రణాళికలో ప్రాధాన్యతనిచ్చారు.

రవాణా, కమ్యూనికేషన్ రంగాలకు కూడా పెద్దపీట వేశారు. ఈ అన్ని రంగాల్లోనూ, రాబోయే సంవత్సరాల్లో సాధించాల్సిన ప్రగతికి బలమైన పునాది వేసిన ఘనత అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుంది. ప్రజల్లో చైతన్యాన్ని పెంచి, కుటుంబ నియంత్రణా పద్ధతులను పాటించటాన్ని ప్రోత్సహించడం ద్వారా జనాభా పెరుగుదలను అరికట్టే చర్యలు ఈ ప్రణాళికలోనే సఫలమయ్యాయి. ఈ ప్రణాళికా కాలంలోనే.. భారత ఆర్థిక వ్యవస్థలో సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టడం జరిగింది. అయితే ఈ సంస్కరణల ఫలితంగా ధరలపై ఉన్న నియంత్రణలను తొలగించటంతో ధరలు పెరిగాయి. మొత్తంమీద 6వ పంచవర్ష ప్రణాళిక ఆశాజనకమైన ఫలితాలను ఇస్తూ... ఆర్థికాభివృద్ధిపై ఆశలు చిగురింపచేసింది. ఆశావాద దృక్పథంతో ప్రారంభమైన ఏడో పంచవర్ష ప్రణాళిక (1985-89)... సాంకేతి పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవటం ద్వారా అన్ని రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచాలని ఆశించింది. మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించి...రాజీవ్‌గాంధీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం..భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చటమే తమ లక్ష్యంగా పేర్కొంది. ఉత్పాదకతతోపాటు ఉపాధి రంగానికి కూడా ప్రణాళికలో పెద్దపీట వేశారు. 6వ పంచవర్ష ప్రణాళికలో సాధించిన మంచి ఫలితాలను పునాదిగా చేసుకొని అందరికీ కూడు, గూడు, గుడ్డ అందించటం లక్ష్యంగా.. ఉపాధి రంగంలో 4 శాతం వృద్ధి లక్ష్యంగా ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల మధ్య సమతుల్యాన్ని, సామరస్యాన్ని సాధిస్తూ... ఆర్థిక స్వావలంబన దిశగా ఈ ప్రణాళిక అమలైంది.

అయితే, 1989లో రాజకీయ అనిశ్చితి ఏర్పడటంతో...1990,91 సంవ త్సరాల్లో వార్షిక ప్రణాళికలను ఏర్పాటు చేయడం జరిగింది.

## ఆర్థిక సంస్కరణలు:

అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థ.. విదేశీ మారక నిల్వలు లేక దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం చెల్లించలేక సంక్షోభం ఎదుర్కోవటం.. చెల్లింపుల సమతుల్య సంక్షోభం (Balance of Payments Crisis)...నేపథ్యంలో 8వ పంచవర్ష ప్రణాళిక (1992-97) అమల్లోకి వచ్చింది. ఈ పంచవర్ష ప్రణాళికలోనే ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. సరళీకరణ (Liberali sation), ప్రపంచీకరణ (Globalisation), ప్రైవేటీకరణ (Privati sation)...మూలసూత్రాలుగా ఆర్థిక సంస్కరణలు అమలయ్యాయి. ఆర్థిక వ్యవస్థలో అమల్లో ఉన్న అనేక రకాల నియంత్రణలను సరళీకరించటం ద్వారా... భారత మార్కెట్‌లోకి విదేశీ వస్తువులను, విదేశీ పెట్టుబడులను అనుమతించటం..ప్రైవేటు సంస్థలను వస్తుసేవల తయారీలో అనుమతించటం..ప్రభుత్వం రంగంలో తయారయ్యే వస్తువులను ప్రైవేటు రంగంలో ఉత్పత్తికి అనుమతించటం.. నష్టాలబాటలో నడుస్తూ, ప్రభుత్వానికి పెనుభారంగా మారిన ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటుపరం చేయటం.. నష్టాలను తగ్గించుకోవటమే కాక నాణ్యమైన వస్తువులను, సేవలను, సరైన ధరకు తయారు చేసి, ప్రపంచీకరణ ద్వారా ప్రపంచ మార్కెట్‌లలోకి ఎగుమతులు చేయగలగటం...తద్వారా విదేశీ మారక నిల్వలను పెంచుకోవటం.. ప్రభుత్వానికి పెనుభారంగా మారిన సబ్సిడీలను తగ్గించి, ద్రవ్యలోటును నియంత్రించటం... ఈ ఆర్థిక సంస్కరణల ప్రధాన సారాంశం. ప్రస్తుత ప్రధాని, అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ అమలుచేసిన ఈ సంస్కరణల వల్ల సంక్షోభంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడింది. సరళీకరణ కారణంగా భారత్‌లోకి విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో వచ్చాయి. ప్రైవేటీ కరణ వల్ల నష్టాల్లో నడుస్తున్న సంస్థల ఆర్థికభారం ప్రభుత్వంపై తగ్గింది. ప్రైవేట్ రంగంలో...అంతర్జాతీయంగా మార్కెట్ ధరలు, నాణ్యతలతో పోటీపడగలిగిన వస్తుసేవల ఉత్పత్తి మొదలైంది. ప్రపంచీకరణ ద్వారా ఈ వస్తు సేవలకు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించే అవకాశం లభించింది. దాంతో ఎగుమతులు పెరిగి, విదేశీ మారక నిల్వలు వృద్ధి చెందాయి. సమృద్ధిగా ఉన్న భారత మానవ వనరుల కారణంగా... సేవల రంగంలో దేశం గణనీయమైన పురోగతి సాధించింది. ఇవి ఈ సంస్కరణల ప్రధాన ఫలితాలు!

ఈ ప్రణాళికా కారణంగానే 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (World Trade Organisation)లో సభ్యదేశమైంది. స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు ఆశించిన లక్ష్యం కంటే ఎక్కువగా 6.3 శాతంగా నమోదైంది. ఈ రకంగా ఆశించిన లక్ష్యాలను అందుకోవటంలోనూ.. విదేశీ మారక నిల్వలను పెంచుకోవటంలోనూ.. జాతీయ స్థాయిలో ద్రవ్యలోటును తగ్గించటంలోనూ.. విదేశీ అప్పుల భారాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవటంలోనూ.. భారతీయ పరిశ్రమలను ఆధునికీకరణ వైపు మళ్లించటం లోనూ... ఈ ప్రణాళిక సఫలమైంది. ఇప్పటివరకు అమలైన అన్ని పంచవర్ష ప్రణాళికల్లోనూ అత్యంత

సమర్థవంతంగా అమలైన ప్రణాళికగా దీన్ని చెప్పుకోవచ్చు.

## ఐటీలో ఆదర్శంగా:

9వ పంచవర్ష ప్రణాళిక (1997-2002)లో.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పౌష్టికాహార భద్రతా, మహిళా సాధికారత, ఆర్థికాభ్రివృద్ధిని మరింత మెరుగుపరచటం; ప్రాథమిక అవసరాలైన ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యంలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవటం లక్ష్యాలుగా నిర్దేశించుకోవటం జరిగింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో... దేశంలో ఇంకా మిగిలి ఉన్న ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి ఈ ప్రణాళికను సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. అందరికీ ఉపాధిని కల్పించటం.. ధరల స్థిరీకరణ.. పెరుగుతున్న జనాభాను నియంత్రించటం.. స్థూల జాతీయోత్పత్తిలో 6.5 శాతం సాధించటం... ప్రధాన లక్ష్యాలుగా నిర్ధారించుకున్నారు. ఉపాధిరంగంలో, పేదరిక నిర్మూలనలో 8వ పంచవర్ష ప్రణాళికలో సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ ప్రణాళికలో నిర్ణయించటం జరిగింది. ఆర్థికాభివృద్ధి పెరుగుదల ఆశించిన 6.5 శాతంతో పోలిస్తే.. 5.35 శాతం మాత్రమే సాధించగలిగారు. ఐతే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఈ ప్రణాళికా కాలంలో... భారత్ తన ప్రగతితో అనేక అభివృద్ధి చెందుతున్నదేశాలకు మార్గదర్శకమైంది. మౌలిక సదుపాయాల రంగంలో స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టు(దేశంలోని తూర్పు, పడమర,ఉత్తర-దక్షిణ ప్రాంతాలను కలుపుతూ.. ఆరులైన్ల జాతీయ రాజమార్గాలు అభివృద్ధి) ఈ ప్రణాళికా కాలంలో గుర్తుంచుకోదగ్గ పరిణామం.

## వృద్ధి లక్ష్యం 8 శాతం :

10వ పంచవర్ష ప్రణాళిక (2002-07)లో స్థూల జాతీయ ఉత్పత్తిలో 8 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్ధారించారు. దేశంలో పేదరికాన్ని 20 శాతం తగ్గించటం..అందరికీ విద్యనందించటంతోపాటు అక్షరాస్యతా శాతాన్ని 75 శాతం పెంచటం..శిశుమరణాలను 45కు తగ్గించటం (ప్రతి 1000 జననాలకు 45 మరణాలు)...మాతృత్వ మరణాల రేటును 2కు తగ్గించటం (ప్రతి 1000 ప్రసవాలకు).. అందరికీ తాగునీటిని అందించటం..దేశంలో ప్రధాన నదులన్నింటినీ శుభ్రపరచటం.. దేశంలో అటవీ భూమి శాతాన్ని 25%కు పెంచటం.. లింగ వివక్షతను రూపుమాపటం.. పారిశ్రామిక రంగంలో విస్తరణ..పెట్టుబడుల రంగంలో మరింత పారదర్శక పద్ధతులను అమలులోకి తేవటం.. 10వ పంచవర్ష ప్రణాళిక ముఖ్య లక్ష్యాలు.

మొట్టమొదటిసారిగా పంచవర్ష ప్రణాళికలో Physical Infrastructure లక్ష్యాలతోపాటు, Social Infrastructure విషయంలో కూడా స్పష్టమైన లక్ష్యాలతో సమగ్ర ఆర్థికాభివృద్ధికి ప్రయత్నించటం జరిగింది. ఐతే ఈ లక్ష్యాలను ఆశించిన స్థాయిలో సాధించలేకపోయినా...Social Infrastructureలో చేయవలసిన కృషిపై స్పష్టత వచ్చింది. ఈ స్పష్టతతోనే 11వ పంచవర్ష ప్రణాళిక (2007-12)లో

లక్ష్యాలను రూపొందించుకోవటం జరిగింది.

## 11వ పంచవర్ష ప్రణాళిక... లక్ష్యాలు:

రూ.36.44 లక్షల కోట్ల వ్యయంతో అమలు చేయబోయే 11వ పంచవర్ష ప్రణాళికలో...

- 10 శాతం వృద్ధిరేటును లక్ష్యంగా నిర్ధారించారు. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటును 4 శాతంగా నిర్ణయించారు.
- ఉపాధి రంగంలో 7 కోట్లు ఉద్యోగావకాశాలను సృష్టించటం ద్వారా విద్యావంతులైన నిరుద్యోగుల శాతాన్ని 5 శాతం కంటే తక్కువకు తీసుకురావడం.
- దేశంలో ఉన్న నిరుపేదల సంఖ్యలో 10 శాతం ప్రజలను పేదరికం నుంచి పైకి తీసుకురావడం.
- ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచటానికి పరీక్షా విధానంలో నిర్ణయాత్మకమైన మార్పులు తేవడం.
- 7 ఏళ్ల లేదా అంతకన్నా ఎక్కువ వయసు ఉన్నవారిలో అక్షరాస్యతా శాతాన్ని 85 శాతానికి పెంచడం.
- శిశు మరణాల రేటును 28కి, మాతా మరణాల రేటును 1కి తగ్గించడం.
- 2009 నాటికి అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించడం.
- 3 ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లల్లో పౌష్ఠికాహార లోపంతో బాధపడే వారిని సగానికి సగం తగ్గించడం.
- బాలికల్లో, స్త్రీలల్లో రక్తహీనత (Anaemia)తో బాధపడేవారి సంఖ్యను సగానికి తగ్గించడం.
- అక్షరాస్యతలో ప్రస్తుతం ఉన్న లింగవివక్షతను (Gender Gap) 10 శాతం తగ్గించడం.
- 0 నుంచి 6 ఏళ్ల గ్రూపులో Sex Ratioను (ప్రతి వెయ్యి మగపిల్లలకు ఎంత మంది ఆడపిల్లలు ఉన్నారు) 2011 నాటికి 935కు, 2017 నాటికి 950కు పెంచడం.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిలోనూ ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభం పొందేవారి సంఖ్యలో... కనీసం 33 శాతం మహిళలు లాభం పొందేట్టుగా చూడటం.
- పిల్లలందరికీ సురక్షితమైన బాల్యాన్ని అందించి, బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపడం.
- 2008 నాటికి అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని అందించడం, BPL కుటుంబాలన్నింటికీ కరెంటు కనెక్షన్ ఇవ్వడం.
- మైదాన ప్రాంతాల్లో 1000 మంది ఉన్న ప్రతి గ్రామానికీ, పర్వత ప్రాంతాల్లో 500 మంది ఉన్న ప్రతి గ్రామానికీ 2009 నాటికి రోడ్డు సౌకర్యం కల్పించడం.
- అన్ని గ్రామాలకూ టెలిఫోన్ సౌకర్యం అందించడం.. 2012 నాటికి అన్ని గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పించడం.
- 2012 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలివ్వడం.. 2016 నాటికి వారంతా ఇల్లు నిర్మించుకునేలా సాయం చేయడం.
- దేశంలో అటవీ భూమి శాతాన్ని 30కు పెంచడం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకనుగుణంగా

SAKSHI

2012 నాటి కల్లా గాలి కాలుష్య స్థాయిని అన్ని పట్టణాలో తగ్గించడం.

- పట్టణాల్లో వృథాగా పోతున్న మురికి నీటిని, దేశంలోని అన్ని నదుల్నీ 2012 నాటికి శుభ్రం చేయడం.
- ఇంధన వినియోగ సామర్థ్యాన్ని 20 శాతానికి పెంచడం.

దేశంలో జరుగుతున్న భౌతిక అభివృద్ధితో పాటు మానవ వనరుల అభివృద్ధిని కూడా సమగ్రంగా కాంక్షించే లక్ష్యాలు 11వ పంచవర్ష ప్రణాళికల్లో పొందుపరచారు. ఈ లక్ష్యాలన్నీ సాధించగలిగితే ఆర్థిక సంస్కరణల ఫలాలు అట్టడుగు వర్గాల వారికి అందటం లేదనే వాదన దూరమౌతుంది. అంతేకాక సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో... మార్కెట్ శక్తులే ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయని, ఇక ప్రణాళికా సంఘం ఉనికి ప్రశ్నార్థకమని విమర్శించేవారికి...ఆర్థికా భివృద్ధి ఫలాలను అన్నివర్గాల వారికి అందేలా చూడటంలో ప్రణాళికా సంఘం ప్రాముఖ్యం, ఆర్థికాభివృద్ధికి దిశానిర్దేశం చేయగల నేతృత్వం ఎంత అవసరమో అర్థమవుతుంది!!